క్లుప్తంగా

13 నుంచి సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలు


సీఐ జయానాయక్‌తో కలిసి పోస్టర్లు విడుదల చేస్తున్న సేవాఘడ్ ప్రచార కార్యదర్శి దినేష్

రాయదుర్గంటౌన్: గుత్తిలోని సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలతో పాటు జగదాంబ మాత 9వ వార్షికోత్సవాలు ఈనెల 13 నుంచి 15వరకు జరుగుతాయని సేవాఘడ్ ప్రచార కార్యదర్శి దినేష్ నాయక్ తెలిపారు. ఆదివారం గుత్తిలోని సేవాఘడ్‌లో జరగనున్న సంత్ సేవాలాల్ జయంతి వేడుకల పోస్టర్లను పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో అర్బన్ సీఐ జయానాయక్ తదితరులు విడుదల చేశారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: కళ్యాణదుర్గం, కుందుర్పి మండలాల్లోని నిరుద్యోగ మహిళలు టైలరింగ్ శిక్షణకు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరసింహమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లోని సొంత గ్రామాల్లోనే శిక్షణ ఉంటుందని, వివరాలకు సెల్: 7013699541లో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి బొబ్బరకుంట ఆంజనేయస్వామి జాతర

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లిలో ఈనెల 11 నుంచి బొబ్బరకుంట ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అతావుల్లా, ఆలయ ధర్మకర్త మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం స్వామికి అభిషేకం, స్వస్తివాచకం, గ్రామోత్సవం ఉంటుంది. బుధవారం మధ్యాహ్నం అగ్నిహోమం, చిన్న రథోత్సవం, రథోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు బ్రహ్మరథోత్సవం సందర్భంగా రథాన్ని ఊరేగిస్తారు. గురువారం వెండిపల్లకీ ఉత్సవం, పానకం బండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

'పది' ప్రజ్ఞ వికాస పరీక్షకు స్పందన


పది మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్: పదో తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టి పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన టెస్ట్ ప్రజ్ఞ వికాస మోడల్ పరీక్షకు స్పందన లభించింది. ఆదివారం పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన మోడల్ పరీక్షకు 500 మంది పదో తరగతి విద్యార్థులు హాజరై, పరీక్ష రాసినట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తెలిపారు. ఎంఈఓ–2 వెంకటరమేష్, యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు, నాగేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు మనోహర్ హాజరయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వలి, గణేష్, గౌతమ్, వీరేష్, వంశీ, రాము, అనిల్, సుకన్య, లక్ష్మీ, భువన, వైశాలి, సంధ్య, సౌమ్య పాల్గొన్నారు.

ఎలుగుబంట్ల సంచారంతో భయాందోళన

శెట్టూరు: మండల కేంద్రంలోని వీధుల్లో మూడు ఎలుగుబంట్లు కనిపించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పోలీసులు గస్తీ తిరుగుతుండగా, బస్టాండ్ వద్ద కుక్కలు అరుపులు వినిపించాయి. పోలీసులు అక్కడికి చేరుకొని చూశారు. బస్టాండ్ వద్ద ఉన్న ఏటీఎం, ఆ చుట్టు పక్కల వీధుల్లో ఎలుగుబంట్లు కనిపించాయి. పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి కుక్కలు వాటిని తరిమివేశాయి. ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు తెలుసుకున్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

యువకుడు అదృశ్యం


దినేష్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కోటవీధికి చెందిన దినేష్ అనే యువకుడు అదృశ్య మయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని కోటవీధికి చెందిన రామాంజనమ్మ, ఆరుడప్ప దంపతుల కుమారుడు దినేష్ జ్ఞాన భారతిలో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి నుంచి దినేష్ కనిపించలేదు. బంధువులు, మిత్రులు, చుట్టుపక్కల గ్రామాల్లో ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పట్టణ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆ చూ కీ తెలిసిన వారు ఈ నంబర్లకు 9381827784, 6362625648 తెలియజేయాలని పోలీసులు తెలియజేశారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

అనంతపురం కల్చరల్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ మాట్లాడారు.

ఆయుర్వేదం..సేవలకు దూరం

- రెండేళ్లుగా తెరచుకోని ఆస్పత్రి
- అందని ఆయుర్వేద వైద్య సేవలు
- ఇబ్బందుల్లో దీర్ఘకాలిక రోగులు


ఉరవకొండలో మూతపడిన ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి

ఉరవకొండ: అల్లోపతి వైద్యంపై నమ్మకం లేని చాలా మంది కొన్నేళ్లుగా ఆయుర్వేద వైద్య చికిత్సల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఉరవకొండలో 50 పడకల ఆస్పత్రిని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఆయుర్వేద వైద్యాన్ని చేరువచేసింది. అయితే గత రెండేళ్లుగా ఈ ఆస్పత్రికి వేసిన వేసినట్లుగానే ఉండిపోయింది. దీంతో ఆయుర్వేద వైద్యం కోసం ఉరవకొండ ప్రాంత ప్రజలు పొరుగున ఉన్న కర్ణాటకలోని బళ్లారికి వెళ్లాల్సి వస్తోంది.

వైద్యుడి మృతితో మూత

ఉరవకొండలోని ఆయుర్వేద వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్ఎండీ షఫీ 2023, సెప్టెంబర్ 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ అదే నెల 25న మృతి చెందారు. ఆ రోజు మూతపడిన ఆస్పత్రి తలుపులు నేటికీ తెరుచుకోలేదు. ఆయన స్థానంలో మరొకరిని వైద్యుడికి నియమించడంలో ఆయుష్ శాఖ ఘోరంగా విఫలమైనట్లుగా విమర్శలు వెల్లువెత్తాయి.

ఖాళీలు భర్తీ చేయని వైనం

ఉరవకొండ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యాధికారితో పాటు ఏఎన్ఎం, నర్సింగ్ ఆర్డర్లీ, పీటీఎస్ స్వీపర్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. 2022 మార్చిలో ఎంఎన్‌ఓగా పనిచేస్తున్న సోము... సంతెబిదనూరుకు, 2023 జూన్‌లో కాంపౌండర్‌గా పనిచేస్తున్న మహేష్.. గుమ్మఘట్టకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఈ విధులు కూడా డాక్టర్ షఫీనే నిర్వర్తిస్తూ వచ్చేవారు. అయితే డాక్టర్ షఫీ మృతితో ఆస్పత్రి నిర్వహణను ఆయుష్ శాఖ గాలికి వదిలేసింది.

> **వైద్య సేవలు అందిస్తాం**
>
> ఉరవకొండ ఆయుర్వేద ఆస్పత్రిని త్వరలో పునరుద్ధరించి వైద్య సేవలు చేరువ చేస్తాం. ఆస్పత్రికి సీనియర్ వైద్యాధికారిని నియమించేలా చర్యలు తీసుకుంటున్నాం. దీంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రస్తుతం సమీపంలోని ఆయుర్వేద ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్‌పై సిబ్బందిని నియమించబోతున్నాం.
>
> – శేఖర్‌రాజు, డిప్యూటీ డైరెక్టర్, ఆయుర్వేద విభాగం

అద్దెభవనంలో ప్రాథమిక పాఠశాల


అర్ధంతరంగా ఆగిన శీగలపల్లి ప్రాథమిక పాఠశాల భవనం

కుందుర్పి: శీగలపల్లి ప్రాథమిక పాఠశాలకు సొంత భవనం లేక పోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ గోవిందమ్మ తదితరులు తెలిపారు. 61 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను ఓ ఇరుకు అద్దె గదిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కింద రూ.30 లక్షల నిధులను మంజూరు చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా భవన నిర్మాణాలు ముందుకు సాగలేదన్నారు. సంబంధితశాఖ అధికారులు చొరవ తీసుకొని ఆగిన పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఎస్సీ కాలనీలోని అద్దె గదిలో పాఠశాలను కొనసాగిస్తున్న టీచర్లు

12న బండి మోటు వేలం

గుమ్మఘట్ట: రాయదుర్గం మండలం 74 ఉడేగోళం మద్దానేశ్వరస్వామి పశువుల జాతర బండిమోటు వేలం ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు, దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. మద్దానేశ్వర ఆలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా దేవతా మూర్తుల గ్రామోత్సవం


గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండలంలోని పిల్లలపల్లిలో మైలార లింగేశ్వరస్వామి ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం మైలారలింగేశ్వర స్వామి, గంగమాళమ్మ దేవి, నందీశ్వర, గణపతి విగ్రహాలకు నవగ్రహ హోమం, వాస్తు హోమం , రుద్ర హోమం నిర్వహించారు. సాయంత్రం దేవతామూర్తుల విగ్రహాలను ట్రాక్టర్‌లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

డ్రిప్ పరికరాలు అపహరణ

కళ్యాణదుర్గం రూరల్: మండలం పరిధిలోని మానిరేవులో డ్రిప్ పరికరాలు, చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ వ్యవసాయ తోటలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డ్రిప్ పరికరాలు, నీటి ఫిల్టర్లను ఎత్తుకెళ్లారు. ఆదివారం వ్యవసాయం తోటకు వెళ్లిన రాజేశ్వరమ్మ..మోటారు వద్ద పైప్‌లైను ధ్వంసం చేసి, నీటి ఫిల్టర్, డ్రిప్ పరికరాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గొర్రెల మందపై నక్కదాడి

కళ్యాణదుర్గం రూరల్: బోయలపల్లి వద్ద గొర్రెల మందపై నక్కదాడి చేసింది. నక్కదాడిలో గొర్రె మృతిచెందింది. బోయలపల్లి చెందిన రవి గొర్రెలను ఆదివారం మేతకోసం తీసుకెళ్లాడు. ఒక్కసారిగా నక్క మందపై దాడి చేసింది. గొర్రెల కాపరులు కేకలు వేయడంతో నక్క కొండ ప్రాంతంలోకి పారిపోయింది.

వర్షాలు సమృద్ధిగా కురిసి సంతోషాలు వెల్లివిరియాలి


వన్నూరుస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న మెట్టు గోవిందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

- రాయదుర్గమ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులతోపాటు ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని స్వామిని వేడుకున్నట్లు వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. మండలంలోని జక్కలవడికిలోని వన్నూరుస్వామిని మెట్టు గోవిందరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వన్నూరుస్వామి ఉరుసును పురస్కరించుకొని మెట్టు స్వామిని దర్శించుకొని, ఆలయంలో పూజలు జరిపించారు. వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, గ్రామ సర్పంచు హనుమంతరెడ్డి, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, స్థానిక నాయకులు భీమిరెడ్డి, హనుమంతరెడ్డి, గిర్రప్పరెడ్డి, అయ్యప్పరెడ్డి, టైలర్ వెంకటేశులు, బోయ రమేష్, బలరాం, హళ్లినాగరాజు, వేమన, కెనిగుంట రామిరెడ్డి, పాటిల్ వెంకటరెడ్డి, మాధవరెడ్డి, మురుడి మురళి, బోర్‌వెల్ ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు... పలకరింపులు:

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పలు గ్రామాల్లో పర్యటించి, నాయకులు, కార్యకర్తలను పలకరించారు. యర్రగుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిరిగి రాజేశ్వరరెడ్డి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బొమ్మనహాళ్ మండలంలోని బల్లనగుడ్డంలో ఎంపీటీసీ రాజేశ్వరి, వీరన్నగౌడ్ కూతురు సుప్రియ వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. జక్కలవడికిలో పలువురు కార్యకర్తలను పలకరించారు. బ్రహ్మసముద్రంలోని వెంకటాక్షిరెడ్డి, మాజీ సర్పంచు లోకేష్‌గౌడ్‌ను పరామర్శించారు. ఆలూరులో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ కుమారుడు విజయ్‌ను పరామర్శించారు.

వైభవంగా పాండురంగస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న గ్రామపెద్దలు

కణేకల్లు: విఠల.. విఠల పాండురంగ విఠల.. అంటూ పాండురంగస్వామి వారి నామస్మరణతో ఆలయ ఆవరణ మార్మోగింది. ఆదివారం మండలంలోని గెనిగెర గ్రామంలో పాండురంగస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకం, రుద్రాభిషేకం, మంగళహారతి, మహా మంగళహారతి, కుంకుమార్చన పూజలు జరిగాయి. అనంతరం రుక్మిణీ, పాండురంగస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. సాయంకాలం రథాన్ని పూలతో సుందరంగా అలంకరించి, ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి రథానికి గజమాల వేశారు. పాండురంగస్వామి ఆలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు రథోత్సవం సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, గ్రామపెద్దలు సీతారామిరెడ్డి, జి.శ్రీనివాస రెడ్డి, గోపాల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ రవీంద్రారెడ్డి, గౌని పురుషోత్తంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అంబాపురం భాస్కర్‌రెడ్డి, సీ.కేశవరెడ్డి, తిమ్మారెడ్డి, పర్వతరెడ్డి, రాఘవరెడ్డి, జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దశాబ్దాల తర్వాత కలిశారు..మురిశారు


ఆమిద్యాలలో కలిసిన 2003-04 బ్యాచ్ విద్యార్థులు


రాయదుర్గంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉరవకొండ/రాయదుర్గంటౌన్: ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003–04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం సందడిగా జరిగింది. నాటి విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు పెరుమాళ్ల శ్రీనివాసులు, సుధాకర్, నజీర్‌సాబ్, గంగాధర్, శశికళ, సువర్ణ, శైలజ, బసవరాజు, బాబా, ఫకృద్దీన్, కృష్ణమూర్తి, గిరిజను సన్మానించారు. అనంతరం చదువు నేర్చుకున్న పాఠశాలకు బీరువాను అందజేశారు.

రెండు దశాబ్దాల తర్వాత సందడి...

రాయదుర్గంలోని కల్లీమఠం మున్సిపల్ హైస్కూల్‌లో 1996–2001 ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు. 25 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకోవడంతో ఆనందానికి అవధుల్లేవు. అందరూ యోగక్షేమాలు తెలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. స్థానికంగా పాటు ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతరాత్ర ప్రాంతాల్లో ఉంటున్న స్నేహితులందరు దాదాపు 70 మంది కలుసుకొని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. నాటి గురువులు శంకరప్ప, శ్రీరాములుతోపాటు ఉపాధ్యాయులు రామాంజనేయులు, అంజినప్ప, హెచ్‌కే బాష, ప్రహ్లాద, రాము, సుధాకర్, రమేష్‌ను సత్కరించారు.

కల్యాణ మంటపాలకు భారీ డిమాండ్

- వివాహ బంధాలతో ఒక్కటవుతున్న జంటలు


రాయదుర్గంలోని కులిహినశెట్టి కల్యాణ మంటపం వద్ద పెళ్లి సందడి

రాయదుర్గంటౌన్: మాఘమాసం రాకతో కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో పెళ్లి సందడి నెలకొంది. గత డిసెంబర్ నుంచి జనవరి నెలాఖరు వరకు మంచి ముహూర్తాలు లేకపోవడం శుభకార్యాలు లేవు. ఈ నెల 2వ తేదీ నుంచి మాఘమాసం ప్రారంభంకావడంతో ఫిబ్రవరి (మాఘమాసం), మార్చి (ఫాల్గుణ మాసం) , ఏప్రిల్ (చైత్ర మాసం), మే (వైశాఖ మాసం) నెల వరకు మంచి ముహూర్తాలు ఉండడంతో వివాహాదీ శుభకార్యాలకు అనుకూలంగా ఉంది. ఈ సీజన్‌లో వందల సంఖ్యలో జంటలు వివాహ బంధంతో ఒక్కటి కానున్నాయి. ఇప్పటికే ముహూర్తాలు పెట్టుకున్న వారి ఇళ్లల్లో పెళ్లి హడావుడి మొదలైంది. వివాహ శుభకార్యాలకు అవసరమయ్యే కళ్యాణ మండపాలు, డెకరేషన్, క్యాటరింగ్ నిర్వాహకులు, పురోహితులకు మంచి గిరాకీ ఏర్పడింది. మరోవైపు శుభకార్యాల సీజన్‌తో వివిధ వర్గాల వారికి చేతినిండా పనిదొరుకుతోంది. డెకరేషన్, క్యాటరింగ్, భజంత్రీలు, పురోహితులు, పూల వ్యాపారులకు ఉపాధికి ఇబ్బంది లేకుండా ఉంటోంది. వస్త్ర, బంగారు వ్యాపారాలకు కూడా ఇది మంచి సీజన్.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: నిరుపేద విద్యార్థికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. శెట్టూరు మండలం చెర్లోపల్లికి చెందిన రమేష్, తిమ్మక్క కుమార్తె జ్యోతి గుత్తి గేట్స్ కాలేజ్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాల ఫీజు చెల్లించలేని పరిస్థితిలో ఉండడంతో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ స్పందించారు. కళ్యాణదుర్గంలోని తన కార్యాలయంలో బుల్లితెర నటులు అప్పారావు, పవన్, ఆనంద్ శేషు చేతుల మీదుగా విద్యార్థిని తల్లి దండ్రులకు రూ.30 వేలు ఆదివారం అందించారు.

నేడు మైలారలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

బ్రహ్మసముద్రం : మండంలోని పిల్లలపల్లిలో మైలార లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం నిర్వహించనున్నారు. వేడుకకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య హాజరుకానున్నారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి వారి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఆక్రమణల పర్వం .. అధికారుల చోద్యం

- ఖాళీ స్థలాలపై కేటుగాళ్ల కన్ను
- నకిలీ పట్టాలు సృష్టించి విక్రయం
- కబ్జాదారుల కోరల్లో రిజర్వు స్థలాలు
- మల్లాపురం లేఔట్‌పై గద్దల్లా వాలిన అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు


మల్లాపురం లేఔట్‌లో నిర్మాణం చేపట్టడానికి పునాది తవ్విన దృశ్యం

రాయదుర్గం: పేదల ఇంటి నిర్మాణాలకు కేటాయించిన కాలనీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. వీటిపై కన్నేసిన ఆక్రమణదారులు యథేచ్ఛగా పునాలు, బేసి మట్టాల నిర్మాణాలు చేపట్టారు. ఓ వైపు అక్రమార్కులను గుర్తించేందుకు అధికారులు సర్వే చేసుతండగా.. మరో వైపు కొందరు కేటుగాళ్లు గద్దల్లా ఖాళీ స్థలాలపై పడి కాజేస్తున్నారు. జేసీబీలు తెచ్చి దర్జాగా పునాదులు తవ్వేస్తున్నారు. అడ్డుకుంటే అంతుచూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. పట్టణంలోని మల్లాపురం లేఔట్‌లో రెండు రోజులుగా ఈ దౌర్జన్యం యథేచ్ఛగా సాగిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికే పట్టణంలోని గౌడ, భంభంస్వామి, బీటీపీ, గ్యాస్ గోడౌన్, మల్లాపురం లేఔట్లలో నకిలీ పట్టాలు పొంది బేసి మట్టాలు నిర్మించుకున్న వారి జాబితా సిద్ధం చేశారు. గౌడ, బీటీపీ లేఔట్లలోని రిజర్వు స్థలాల్లో ఓ వ్యక్తి ఆరు నకిలీ పట్టాలు పొంది ఒక్కొక్కటి రూ.2 లక్షల ప్రకారం రూ.12 లక్షలకు విక్రయించుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు చేసిన తాజా సర్వేలోనూ సుమారు 500లకు పైగా బోగస్ పట్టాలు గుర్తించినట్టు తెలుస్తోంది.

అధికారులు చర్యలకు రంగం సిద్ధం..

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. తొలుత రిజర్వు స్థలాల్లోని బేసి మట్టాలు తొలగించి కంచె వేయనున్నారు. ఆ తర్వాత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయనున్నారు. పట్టాలు పొంది ఐదు లేదా పదేళ్లు కావస్తున్నా, ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే స్థలాలు రద్దు చేసేలా నిర్ణయం తీసుకుంటారు. వాటిలో కొత్త లబ్ధిదారులకు అవకాశం కల్పిస్తున్నట్టు సమాచారం. బోగస్ పట్టాలు పొందిన వారికి నోటీసులు ఇవ్వకనే స్థలాలు స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు. అవసరమైతే కొందరిపై కేసులు నమోదుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో అక్రమార్కుల గుట్టు వీడనుండడంతో వణుకు మొదలైంది. మల్లాపురం లేఔట్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న దురాక్రమణలపై చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

> **అక్రమణ దారులపై కొరడా**
>
> ప్రభుత్వ లేఔట్లలో నకిలీ పట్టాలు సృష్టించి విలువైన రిజర్వు, లేఔట్లలోని కబ్జాకు గురైన స్థలాలన్నీ పరిరక్షించి, స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే అన్ని లేఔట్లలో సర్వే చేయించి నివేదికను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశాం. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎలాంటి వారున్నా ఉపేక్షించేదిలేదు. నకిలీ పట్టాల వెనుక సూత్రదారులు ఎవరనేది విచారణ జరిపిస్తాం. మల్లాపురం లేఔట్‌లో ఆక్రమణలను అడ్డుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపైనా కేసులు నమోదు చేయిస్తాం.
>
> – నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

ఉద్యాన రైతులకు బిల్లులు మంజూరు చేయండి

కుందుర్పి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో రైతులు సాగుచేసిన వివిధ రకాల పండ్లతోటల సాగు బిల్లులు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, రైతు సంఘం జిల్లా నాయకులు పెద్దప్పయ్య తదితరులు కోరారు. ఆదివారం కుందుర్పి మండలంలో సాగు చేసిన మామిడి మొక్కలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 380 ఎకరాల్లో పండ్లతోటలను సాగు చేశారన్నారు. నెల రోజులుగా ఉపాధి బిల్లులు అందక, మొక్కలను పెంచలేక పెంపకందారులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఒక ట్యాంకరు నీరు సరఫరా చేయాలంటే రూ.1500 అడుగుతున్నారని, ఇది మరింత భారమవుతున్నట్లు వారు తెలిపారు.

జూదరుల అరెస్ట్

బొమ్మనహాళ్: ఉప్పరహాళ్ పొలాల్లోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న 13 మందిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్ఐ నబీరసూల్ తన సిబ్బందితో దాడులు చేసి, పేకాటరాయుళ్ల నుంచి రూ.8,430 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.